# గుడి

నలుగురు బాడీగార్డులు తుపాకులు ఎక్కుపెట్టి నడవగా వాళ్ల వెనుక వస్తున్న ఎం.ఎల్.ఏ. అభ్యర్థి, కొక్కెరతెగులు తగిలిన కోడి మెడ నిగిడ్చినట్లు నిగిడ్చిన మెడతో, కఱ్ఱతో కొట్టినా వంగని, నలగని అంతగా గంజి దట్టంగా పెట్టిన కుర్తా పైజామాతో, నిమ్మకాయల్నే కాదు, దబ్బకాయల్ని, దానిమ్మ కాయల్ని నిలబెట్టినా వంగని దట్టంగా గుబురుగా నల్లగా ఉన్న మీసాలతో, అన్ని వాహనాలూ ఆగిపోవాలని ఆర్డరు వేసినట్లున్న ఎఱ్ఱలైట్ల రోడ్డుసిగ్నల్‌లాంటి కళ్లతో, తిరుపతి కొండెక్కి, శ్రీ వేంకటేశ్వరస్వామికి తలనీలాలు సమర్పించి సాధించుకున్న గుండుతో, రక్తపు మడుగు తొక్కి వచ్చినట్లు ఎఱ్ఱ ఆకు చెప్పులతో, కాళికాదేవి రక్తం తాగిన నాలుక కొసతెంచి, నుదుట అలంకరించుకొన్నట్లున్న కుంకుమబొట్టుతో, తాను నడచినంత మేర భూమి అంతా నాదేనన్న ధీమాతో,తిక్కరంగయ్యకు, రెండు చేతులూ జోడించి, గుండెమీదనుంచి ముఖంమీదకి ఎగదోసి నమస్కరించి నిలబడ్డాడు.

పెద్దమ్మ గుడిముందు, బాచిపట్టువేసుకొని కూర్చున్న తిక్కరంగయ్య అభ్యర్థిని చూడలేదు, తుపాకుల్ని చూడలేదు. జనాన్ని చూడలేదు. శబ్దం వినలేదు, కదల్లేదు, మెదల్లేదు.

తిక్క రంగయ్య పెద్దమ్మగుడి పూజారి. అసలు పేరు ఆంజనేయులు. పదిపాసయ్యాడు. తెలివైనవాడే. ఎందుకో శ్రీరంగంపోయి వచ్చాడు. అప్పటినుండి ఆంజనేయులూ అంటే పలకటం మానేశాడు. రంగయ్య అంటే పలుకుతాడు. ప్రవర్తన, మాటలు, చేతలు, చూపులు అదో మాదిరిగా ఉంటుంటే తిక్కోడని జనం అనుకోసాగారు. నాటినుంచి అతను తిక్కరంగయ్య అయ్యాడు. 'తిక్క రంగయ్యా' అంటే ఎంతో సంతోషిస్తాడు.

పెద్దమ్మ గుళ్లోకి కుంకుమ ఎవరూ తెచ్చిపెట్టరని, రాత్రికి రాత్రి అది రాలిపడుతుందని, తిక్కరంగయ్య కుంకుమ బొట్టుపెట్టినా, పొట్లం కట్టించి ఇచ్చినా, శుభం జరుగుతుందని ప్రఖ్యాతి వ్యాపించింది.

ఉద్యోగం లేనివాడికి తిక్కరంగయ్య కుంకుమ బొట్టుపెట్టగా ఉద్యోగం వచ్చిందని, పెళ్లికాని అమ్మాయికి బొట్టువల్ల పెళ్లయిందని, కానుపు కష్టమయిన నిండుచూలాలికి ఈ కుంకుమ నీళ్లు తాగిస్తే కుంకుమ పువ్వులాంటి కొడుకు పుట్టాడని, సంవత్సరాల తరబడి పీలగా ఎండిపోతున్న పాపకు కుంకుమనీళ్లు తాగిస్తే రెండునెలల్లోగా దొరల

ఇళ్ళలోంచి దొంగిలించి తెచ్చిన గసికలాగా మారిందని, విద్యార్థులు పాసయ్యారని, గొడ్రాళ్లు నెలతప్పారని, మొండిజబ్బులు మాయమయ్యాయని, పోయిన చూపు, వినికిడి స్పర్శ వచ్చాయని, రకరకాల అద్భుతాలు ప్రచారంలో ఉన్నాయి. పెద్దమ్మగుడిలో దేవుడు రాళ్ళే కుంకుమ తిక్కరంగయ్య ఇస్తేనే ఇన్ని ఆశ్చర్యకరమైన మేళ్లు జరుగుతున్నాయని జనం విశ్వసిస్తున్నారు.

ఇవాళ విత్తనాలు వేయండి అంటే వేస్తే పంటదిగుబడి ఇబ్బడి ముబ్బడిగా ఉందనీ, ఈరోజు వెళ్లండి అంటే వెళితే మేలు జరుగుతుందనీ, వద్దు అన్నా వెళితే కీడు జరిగిందనీ ప్రచారం, తిక్కరంగయ్య చేయి అంటే చేయటం, వద్దు అంటే మానటం జనంలో రివాజు అయింది. అదీ తిక్కరంగయ్యకున్న ఖ్యాతి. అతడు ఎప్పుడు గుడి ముంగిటే ఉంటాడు. కూర్చుని కాకపోతే పడుకొని ఉంటాడు.

ఆ వూళ్ళో రెండువేల ఇళ్లున్నాయి. ఐదారువేల ఓట్లున్నాయి. ఆవూరి వాళ్లు ఈ ఓట్లు తిక్కరంగయ్య ఎవరికి వెయ్యమంటే వాళ్లకు వేస్తారు. వేయనివాళ్లకు మూడిన కీళ్లు కూడా జనం ప్రచారంలో ఉన్నాయి.

అభ్యర్థి, ఏ ఓటరునూ ఇంటింటికీ పోయి, గడపగడపా ఎక్కీ తొక్కీ దిగీ, పేరుపేరునా అయ్యా, అమ్మా, అక్కా, అని అడిగి తిరిగి తిప్పలు పడనక్కరలేదు. తిక్కరంగయ్యతో చెప్పిస్తే చాలు. ఎవరికైనా అడిగినా 'తిక్క రంగయ్య స్వామి ఎట్టా చెబితే అట్టా' అంటారు కూడా.

నమస్కరించిన అభ్యర్థి చేతులు కట్టుకొని 'తిక్కరంగయ్య స్వామిగారూ!' అని పిలిచాడు. తిక్కరంగయ్య తలెత్తి చూసి 'ఏమి?' అన్నాడు.

'కుంకుమ?' అన్నాడు అభ్యర్థి.

'లేదు!' అన్నాడు తిక్కరంగయ్య.

ఇంక అభ్యర్థి అక్కడనుంచి వెళ్లిపోయి వుండాలి. వెళ్లలేదు. వెళ్లకపోగా 'స్వామిగారూ లోపల రాశి ఉంది కదా' అన్నాడు.

'ఉంది. కానీ నీకు లేదు'

ఇక ఆపైన అక్కడ నిలువకుండా వెళ్లిపోయి ఉంటే మేలుగా ఉండేది. అభ్యర్థి పోలేదు.

'పెద్దమ్మకు మూడంతస్థుల భవనం కట్టి' స్తానన్నాడు.

'మంచిదే!'

'పూజారికి సమస్త సౌకర్యాలున్న ఇంద్రభవనం కట్టి'స్తానన్నాడు

'మంచిదే'

తిక్కరంగయ్య తల్లిదండ్రులుంటున్న ఇల్లు అన్ని వసతులూ ఉన్నదే! రంగయ్యకు అది అక్కరలేదు. పెళ్లిలేదు. పిల్లలు ఎందుకుంటారు? ఊరంతా అతడి పిల్లలే! ఎందుకుండరు? ఏమీ లేదు సొంతం. ఊరంతా సొంతమే! ఇంకేం కావాలి?

ఇంతా చెప్పి మళ్ళీ అభ్యర్థి అడిగాడు 'కుంకుమ'

'లేదు'

'ఎందుకులేదు?'

తిక్క రంగయ్య మాట్లాడలేదు. తలెత్తి ముఖంలోకి పెద్దమ్మలాగా చూశాడు. తిక్కరంగయ్య

అభ్యర్థి బెదిరాడు.

'తుపాకులు పట్టుకొన్నవాళ్లు ఎవరు?'

'నా బాడీ గార్డులు!'

'ఎందుకీ రక్షణ?'

'నాకు అపాయం రాకుండా చూడడానికి!'

'నీకు అపాయం ఎందుకు వస్తుంది? ప్రజానాయకుడివి కదా!'

'ప్రజాసేవకుణ్ణి'

'ప్రజలు సేవకుణ్ణి చంపుకొని సేవలు పోగొట్టుకొనే బుద్ధిహీనులు కారు'

'శత్రువులు'

'ఎందుకున్నారు? ఏం చేశావు? ఖూనీలు చేశావా? మానభంగాలు చేశావా? దుష్పటి పంచాయితీలు చేశావా? ఏం చేశావు?'

'ఏమీ చేయలేదు'

'చేయించావా?'

'చేయించలేదు'

'ఎన్ని క్రిమినల్ కేసులున్నాయి నీమీద? ఎన్ని సివిలు కేసులున్నాయి?'

'గిట్టనివాళ్లు పెట్టించారు'

'ఎందుకు పెట్టించారు?'

'ఊరికే ఉండలేక'

'కేసులెన్ని?'

'ఏభయ్యో అరవయ్యో ఎన్నో'

'నూరో, నూటయాభయ్యో ఉండవచ్చునా?'

'చెప్పలేను, ఉండవచ్చు'

'ఎన్నిసార్లు శ్రీకృష్ణజన్మస్థానం చూశావు?'

'వెళుతూ వస్తూ ఉంటాను. లెక్కలేదు'

'నీ మీద హత్యాప్రయత్నం ఎప్పుడైనా జరిగిందా?'

'చాలాసార్లు'

'బ్రతికే ఉన్నావు! చంపదలచినవాళ్లు చచ్చిపోయారు. అవునా?'

'అవును. కరెక్టుగా చెప్పారు స్వామీ!'

'నీ శత్రువులు ఎవరూ బ్రతికిలేరు కదా! మరెందుకు ఈ బాడీగార్డులు?'

'ఎప్పుడేమవుతుందోనన్న భయం స్వామి!'

'వాళ్లు నిన్నెందుకు చంపబోయారు?'

'ఊరికే స్వామి. నా నేరం ఏమీలేదు. నేనుండకూడదు. పోటీ చేయకూడదు. గెలవకూడదనీ వాళ్ల అక్కసు.'

'నువ్వు పోటీచేయకపోతే నీ శత్రువులు నిన్ను వదిలిపెడతారా?'

'వదలరు. గెలిస్తే భద్రత ఉంటుంది.'

'ప్రాణభద్రత కోసం గెలవాలికానీ, ప్రజాసేవకోసం కాదు కదా'

'బ్రతికి ఉంటే ప్రజాసేవ చేయవచ్చు'

'ప్రజాసేవకుడు ప్రజలమధ్యకు రావటానికి ప్రాణభయంతో హడలి చస్తూ ఏం సేవ చేయగలడు? ప్రజల మనిషికి ప్రాణభయం ఎందుకు? ప్రజల్లోకి రాలేనివాడికి ప్రజాసేవ ఎందుకు? ఈ ఎన్నికలెందుకు? ఈ పోటీలెందుకు?'

'పోటీ చేస్తున్న మా నలుగురికీ బాడీగార్డు భద్రత ఉంది'

'ఈ భద్రత లేనివాడికి, ప్రజలు ఓటువేయడం క్షేమంకదా? సామాన్యుడు, నలుగురిలో ఒకడు, సేవతప్ప మరో దృష్టిలేనివాడు, ముఖ్యంగా భయంలేనివాడు,

ప్రజలమనిషి ఎం.ఎల్.ఎ. కావాలికాని నీలాంటి ఈ నలుగురూ కాదు" అన్నాడు తిక్కరంగయ్య అభ్యర్థి ఏదో చెప్పబోయాడు.

'తుపాకిని రక్షణగా నమ్ముకొన్నవాడు అసలు పనికిరాడు" ఉండలేక మళ్లీ అన్నాడు.

'తుపాకులున్న వాళ్లతో వచ్చి, తుపాకులులేనివాళ్లను బెదిరించే వాడు, భయపెట్టేవాడు ఎందుకు కొరగాడు' అన్నాడు మళ్లీ.

'నువ్వెళ్ళవచ్చు!' అంటూ కూర్చున్న తిక్కరంగయ్య అక్కడే పడుకున్నాడు.

పెద్దమ్మగుడిచుట్టూ పోగైన జనం అభ్యర్థి ఓటమి గేరంటి అనుకొన్నారు. కుంకుమబొట్టు పెట్టకపోవటం ఒక సూచన. పొట్లాం ఇవ్వకపోవటం మరో సూచన.

'నేను తుపాకులతో వచ్చిన వాళ్లను దూరంగా పంపుతాను' తిక్కరంగయ్య ఏమీ మాట్లాడలేదు.

'ఎమ్మెల్యే కావటానికిగాని, అయిన తర్వాతగాని ఆయుధ సంరక్షణ తిరస్కరిస్తాను. త్యజిస్తాను. ఒంటరిగా తిరుగుతాను. మీ అండ పొందుతాను'

ప్రజలు ఆసక్తిగా,భయంగా వింటున్నారు. ఆయుధాలున్న అభ్యర్థిని చూసి వాళ్లు భయపడలేదు. భద్రత వదిలేస్తానంటున్న అతణ్ణి గురించి భయపడుతున్నారు.

తిక్కరంగయ్య బదులు చెప్పలేదు.

'ప్రజా సేవకుడు ఎలా ఉండాలని మీరు భావిస్తున్నారో అలాగే ఉంటాను'

పడుకొని తిక్కరంగయ్య కదల్లేదు.

అసలు ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని స్వామి ఆరోజు చాలాసేపు చాలామాటలు మాట్లాడాడని జనం భావించారు.

'నేను క్రిమినల్ సివిల్ కేసులు రాకుండా చూసుకొంటాను' జవాబు రాలేదు.

'హత్యలు, మానభంగాలు, దోపిడీలు, ఫోర్జరీలు, అక్రమాలు, దుర్మార్గంగా ఆస్తులు ఆర్జించటాలు మానేస్తారు'

బదుల్లేదు.

'ఉన్న ఆస్తులు, సంపద, పొలాలు, ఇళ్లస్థలాలు, ఫ్యాక్టరీలు, డబ్బు, బంగారం, నగలు, భవనాలు, పెట్టుబడులు, షేర్లు, బాండ్లు, డిబెంచర్లు, అన్నీ యావదాస్తి జనానికి పంచిపెడతాను'

తిక్కరంగయ్య మౌనంగా ఉన్నాడు.

ప్రజలు అతడి మాటలు వింటూ ఆశ్చర్యపోతున్నారు. ఇదంతా ఓట్లకోసం చేసే బూటకమేనా? నిజంగా మనిషిలో మార్పు వచ్చిందా? మార్పు వచ్చేంత మాహాత్మ్యం ఏం జరిగింది? తిక్కరంగయ్య స్వామి మాట్లాడటమా, మాట్లాడకపోవటమా. ఏది ప్రేరణ ఈ మాటలు చేతలు కాగలవా?

ఏమో! ప్రజలు మాటల్లేకుండా చేష్టలు లేకుండా నిలబడి పోయారు.

'అన్నీ పంచి, అన్నీ వదిలేసి, కట్టుబట్టలతో వచ్చి మీలాగా ఈ గుళ్లో నిర్భయంగా, సన్యాసిలాగా బతుకుతాను' గుళ్లో కూర్చున్నాడు.

తిక్కరంగయ్య ఒత్తిగిల్లాడు. కదిలాడు, లేచి కూర్చున్నాడు. 'నా గుళ్లో వచ్చి కూర్చుంటాడా?' అనుకున్నాడు. అభ్యర్థితో అన్నాడు.

'బతకలేవు!'

'బతుకుతాను. నీతోపాటు నేనూ ఉంటాను. నీకున్నంత ప్రజాభిమానం నేనూ సంపాదించుకుంటాను. నీతోపాటు నేనూ కుంకుమ పంచిపెడతాను.'

'అభ్యర్థి కుంకుమ ముట్టుకుంటే అది పెంటయిపోదూ! పెంట పంచుతాడా? పంచలేడు. పంచడు. అనుకున్న తిక్కరంగయ్య, 'అది పెద్దమ్మ కుంకుమ. స్వర్గ సంపద, భగవదాస్తి. అది ఐహిక సంపదలన్నింటికంటే గొప్పది. విలువకలది. దాన్ని దక్కనివ్వడు' అని నిర్ణయించుకొని 'చంపేస్తారు' అన్నాడు.

'ఎవరు?' అన్నాడు అభ్యర్థి. స్వామి పడుకున్నాడు.

'నా శత్రువులా? అన్నాడు.

సమాధానం లేదు.

'దేవుళ్ళా?' బదుల్లేదు.

'ఎవరు? ఎవరు? ఎవరు? నిశ్శబ్దం స్వేచ్ఛగా విహరిస్తూ ఉంది.

సాయుధుడు కానివాడి దగ్గర ఏమీలేని సన్నాసిదగ్గర ఓడిపోవడం అభ్యర్థికి ఇష్టంలేదు.

తిక్కోడిని అడుక్కోవలసి రావటమే శిక్షగా హింసగా పీడగా ఉంది. ఇంతమంది ముందు ఇంతలా భంగపడటం భరించలేకుండా ఉన్నాడు.

ఇంతకాలం, ఇందరిని, ఇన్ని విధాల హడలెత్తించిన తాను, వీణ్ణేమీ చేయలేకపోవడం తన బలంమీద అవిశ్వాసాన్ని, అశక్తతమీద నమ్మకాన్ని పెంచుతూ ఉంది.

తిక్కోణ్ణి కొట్టవచ్చు! ఏంప్రయోజనం? చంపవచ్చు! ఏం లాభం? వాణ్ణి ఏమయినా చేయవచ్చు. ఏమీ ఉపయోగం ఉండదు. ఓటమి ఖాయం.

ఏమీ చేయలేనితనం, చావుకంటే, నరకం కంటే హింసగా ఉంది.

ఎమ్మెల్యేగా ఓడినా చింతలేదు, శత్రువులు చంపినా బాధలేదు.

ఏ ఆయుధమూ లేని వీడు ఇంతగా అవమానం చేయడం పైగా నిశ్చింతగా ఉండటం. గడ్డిపరకగా తీసేస్తూ పడుకొని కదలక పోవటం చూస్తుంటే చావటం మేలనిపిస్తుంది. నిజంగా ఈ బ్రతుకు కంటే చావు సుఖం. సన్యాసం సుఖం. అభ్యర్థికి కసి పుట్టింది. ఆకు చెప్పులు విసిరి దూరంగా తన్నేసాడు.

జనం నివ్వెరపడి చూస్తున్నారు.

స్వామి ఏమీ అనలేదు.

కాసంత వెడల్పు, ఐదురూపాయల బిళ్లంత దట్టంగా ఉన్న కుంకుమ బొట్టు ఎడాపెడా తుడిసేసుకున్నాడు.

ఏమయింది అభ్యర్థికని జనం బిత్తరపోయి చూడసాగారు.

కుంకుమ అంటిన చేతులతో, శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహించిన గుండుమీద బాదుకొన్నాడు.

తలపగిలినట్లు అంతా ఎర్రగా అయిపోయింది. గుడ్లు పీకినట్లు ఎర్రగా కళ్లు.

జనం నోటమాటరాలేదు. స్వామి కదల్లేదు.

ముఖం బాదుకొన్నాడు. మీసాలు పీక్కొన్నాడు. చిందులేశాడు.

పిచ్చిపట్టిందా అనుకున్నారు జనం.

కుర్తాపైజామా పరాపరా చింపుకున్నాడు. నిగిడిన గంజి బట్టల్ని నిలువునా చీల్చాడు. పేలికల్ని విసిరి పారేశాడు. పైజామా తుంపుల్ని కాళ్లతో అణగదొక్కాడు.

జనం బిత్తరపోయారు. భయపట్టారు.

స్వామిలో చలనం లేదు.

డ్రాయరు బనీనుతో నిలబడ్డ అభ్యర్థి 'ఇప్పుడే ఇక్కడే కూర్చుంటా! ఏమంటావురా తిక్క నా కొడకా!' అన్నాడు.

స్వామి నవ్వాడు. లేవలేదు. ఒత్తిగిల్లలేదు. ఉన్నవాడు ఉన్నట్టే ఉండి అన్నాడు.

'అంత సులువు కాదు'

'అవుతుంది. అయి తీరుతుంది'

'నీతో వచ్చిన జనం, నీకోసం ఎదురు చూస్తున్న జనం' ,నీ బాడీ గార్డులు, నీకోసం తుపాకులు, బాంబులు పట్టుకున్న వాళ్లను ఏం చేస్తావు?' అడిగాడు స్వామి.

'పొమ్మని చెప్పి వచ్చి కూర్చుంటాను'

'రాలేవు!'

దూరంగా నిలబడ్డ తన సాయుధుల్ని, అనుచరుల్ని, నాయకుల్ని ప్రజల్ని పొమ్మని అరిచి కేకలుపెట్టి చెప్పాడు.

పోలేదు.

తిట్టాడు.

పోవడంలేదు.

రాళ్లు తీసుకొని విసరసాగాడు. వాళ్లు వెనక్కు తగ్గారు.

రాళ్లు విసురుతూ పరుగెత్తసాగాడు. వాళ్లు వెనుదిరిగి చూడకుండా పరుగెత్తుతున్నారు. పక్కలకు చేరుకున్నారు.

అభ్యర్థి రాజకీయాలలో డ్రాయరు, బన్నీను, రాళ్ళతో ఆకలి ఆకలి అంటూ పుట్టాడు. శత్రువుల్ని చంపాడు.

ఇప్పుడు తిన్నదరగదు. అలమరాలనిండా బట్టలు, చుట్టూ ఆయుధాలు, సాయుధపాణులు. లెక్కలేనంత సంపద.

అంతా ఉండికూడా రాజకీయ జన్మనాటి అవతారం ఎత్తి అనుచరుల్ని, మిత్రుల్ని, సొంత వాళ్లని చంపబోతున్నాడు.

వాళ్లు పారిపోతున్న కొద్దీ అభ్యర్థి పరుగులు పెడుతూ ఉన్నాడు. వీధి మలుపులు తిరిగాడు. ఎవరూ కనిపించటంలేదు.

కాల్పులు జరుగుతున్నాయి. బాంబులు పేలుతున్నాయి. అల్ల కల్లోలం.

అభ్యర్థి రాలేదు. పెద్దమ్మ గుడిముందు కూర్చోలేదు. వస్తాడన్న నమ్మకం లేదు.